# రెడ్ క్రాస్ ఆర్గనైజేషన్ తో ప్లేట్ లెట్స్ డొనేషన్ గురించి ఇంటర్వ్యూ

Back Home

ఈ పేజీని పంపండి

సామాజిక సేవ చేస్తున్న రెడ్ క్రాస్ ఆర్గనైజేషను గురించి అందరూ వినే వుంటారు. అలాగే రక్తదానం గురించి కూడా చాలా మందికి తెలుసు. రక్తదానం కన్నా విలువైన ప్లేట్ లెట్స్ దానం గురించి చాలా మందికి తెలియదు. ఈ విషయం గురించి "కబుర్లు" పాఠకులకి తెలియచేయడానికి, నేను రెడ్ క్రాస్ ని సంప్రదించాను. నేను ఎవరన్నది ముఖ్యం కాకపోవటం వల్ల, నా పేరు ఎక్కడా రాయడం లేదు. పాఠకులు అర్థం చేసుకుంటారని భావిస్తాను.

రెడ్ క్రాస్ కి "కబుర్లు" పత్రిక గురించీ చెప్పి వారి గురించి "కబుర్లు" పాఠకులకు పరిచయం చేద్దామనుకుంటున్న విషయం గురించీ నేను చెప్పగా విని హర్షం వెలిబుచ్చింది. అయితే రెండు నియమాలు (stipulations) పెట్టింది.

మొదటిది ఏ డోనర్ తో అయితే "కబుర్లు" వచ్చి ఈ మొత్తం కార్యక్రమం పరిశీలిస్తుందో, ఆ డోనర్ చేతి నరంలోకి సూది గుచ్చుతున్నపుడు ఫొటో తీయకూడదనీ. రెండవది ఇతర డోనర్ల ఫొటోలు తీయకూడదనీ. నేను ఈ రెండు నియమాలకీ సంతోషంగా ఒప్పుకున్నాను.

ముందరగా ఆర్ట్ ని (Art) కలిసి, "ఈ ప్లేట్ లెట్ డొనేషను అంటే ఏమిటండీ?" అని అడిగాను.

దానికి జవాబుగా, ఆర్ట్ , "రక్తంలో వుండే ఈ ప్లేట్ లెట్స్ అనే కణాలు రక్తం గడ్డ కట్టడానికి చాలా అవసరం. ప్రతీ మనిషి రక్తంలోనూ తెల్ల కణాలూ, ఎర్ర కణాలూ, ప్లాస్మా, ప్లేట్ లెట్సు వుంటాయి. కొంత మంది పేషంట్సుకి ఈ ప్లేట్ లెట్సు రక్తంలో లేకపోవడం వల్ల రక్తం గడ్డ కట్టదు. డోనర్స్ దగ్గర నించీ సేకరించిన ఈ ప్లేట్ లెట్స్ ని పేషంట్సుకి ఎక్కిస్తారు." అని చెప్పారు.

"ఎటువంటి పేషంట్లకి ప్లేట్ లెట్స్ అవసరమవుతుందండీ?" అని నేను అడిగితే, "కేన్సర్ , లుకేమియా, అప్లాస్టిక్ అనీమియా, ఓపెన్ హార్ట్ సర్జరీ పేషంట్సుకి ఈ ప్లేట్ లెట్స్ అవసరం. కీమో థెరపీ, రేడియేషన్ థెరపీ తీసుకునే పేషంట్ల శరీరాలు ఈ ప్లేట్ లెట్స్ ని తయారు చెయ్యలేకపోతాయి. ఎక్కువ మంది పేషంట్సు ఇరవై యేళ్ళ లోపు వాళ్ళే. ఈ ప్లేట్ లెట్స్ ఎక్కించకపోతే, ఈ పేషంట్సు ప్రాణాపాయకరమైన రక్తస్రావానికి గురవుతారు." అని చెప్పారు ఆర్ట్ .



ఈ విషయాలు విన్నాక, నేను మొత్తం కార్యక్రమం గురించి తెలుసుకోవాలని నిశ్చయించుకుని ఒక డోనర్ ని సంప్రదించాను. ఆ డోనర్ తో కలిసి "కబుర్లు" రెడ్ క్రాస్ ఆర్గనైజేషన్ కి ఒక శనివారం పొద్దున్న వెళ్ళాను.

లోపలకి అడుగుపెట్టగానే, ఒక రిజిస్టర్డ్ నర్సు ఖానా నుయెన్ (Khanh Nguyen) వచ్చి, చిరునవ్వుతో పలకరించి, డోనర్ కి రెండు

టమ్స్ ఇచ్చారు.

ప్రశ్నార్థకంగా చూసిన నాకు, "ప్లేట్ లెట్స్ దానం చేస్తున్నప్పుడు కొంత కాల్షియం కూడా శరీరం కోల్పోతుంది. దానివల్ల తాత్కాలికంగా మొహం కాస్త బరువవడమూ, పెదిమలు కాస్త తిమ్మిరెక్కడమూ జరుగుతుంది కొంత మందికి. ఈ టమ్స్ శరీరానికి కాల్షియం సప్లై చేస్తాయి." అని వివరించారు. నేను అర్థమయిందన్నట్టు తలాడించాను.

ఆ తరువాత ఆ డోనర్ కి ఒక ప్రశ్నా పత్రం ఇచ్చారు. అందులో చాలా ప్రశ్నలున్నాయి. "ఇవాళ నీ ఆరోగ్యం ఎలా వుంది?" అనే ప్రశ్నతో మొదలై, "ఏమన్నా రక రకాల రోగాలున్నాయా" అనీ, "ఎప్పుడన్నా వ్యభిచారం చేశావా" అనీ, "మొగవాడివైతే వేరే మొగవాళ్ళతో సెక్స్ లో పాల్గొన్నావా" అనీ, "స్త్రీ అయితే గర్భవతివా" అనీ, "ఎప్పుడెప్పుడే వూళ్ళు వెళ్ళావూ" అనీ, "డాక్టరు ఆధ్వర్యంలో వున్నావా" అనీ, రక రకాల ప్రశ్నలున్నాయి. డోనర్ అవన్నీ ఆన్సర్ చేసి, సంతకం పెట్టారు.

ఆ ప్రశ్నా పత్రం చూసి, "ఎవరైనా ఇండియా వెళ్ళి వస్తే కొంతకాలం వరకూ రక్తదానం గానీ, ప్లేట్ లెట్స్ దానం గానీ చేయకుండా వేచివుండాలని విన్నాము. ఎందువల్లా? ఏ కారణంగా దేశాలని నిర్ణయిస్తారూ? ఇటువంటి షరతులతో వున్న వేరే దేశాలు కూడా వున్నాయా?" అని అడిగాను.

ఆ ప్రశ్న విని కో-ఆర్డినేటర్ శేరా (Sara J. Rawland) ఇలా చెప్పారు.

"ఓకే, వెల్ , ఇండియా వెళ్ళి వచ్చాక ఒక యేడాది వేచి వుండటానికి కారణం మలేరియా. మొత్తం ఇండియా అంతటికీ ఈ సమస్య లేదు. కాశ్మీరు వెళ్ళి రావచ్చు ఎవరైనా. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (CDC) నిర్ణయించినట్టుగా ఏ దేశానికైతే మలేరియా సమస్య వుందో, ఆ దేశం వెళ్ళి వచ్చిన వాళ్ళు ఒక యేడాది వేచి వుండాలి డొనేషన్ చేయడానికి. ఆఫ్రికాలో వున్న చాలా దేశాలకూ (ఈజిప్టు తప్పించి), సౌత్ అమెరికా, సెంట్రల్ అమెరికా, మెక్సికో లాంటి దేశాలకూ ఈ మలేరియా సమస్య వుంది. యూరోప్ లో ఈ సమస్య లేదు."

"మరి యూరోప్ లో మేడ్ కౌ వ్యాధి వుంది కదా?"

"అవును. అందుకే యూరోప్ లో ఎవరన్నా ఆరునెలల కన్నా ఎక్కువ కాలం నివసిస్తే (1980 నించీ మొత్తం ఆరునెలలు), వాళ్ళు రక్తదానం గానీ, ప్లేట్ లెట్స్ దానం గానీ చెయ్యడానికి వీలు లేదు. ఈ వ్యాధులని గుర్తించడానికి ఇంకా సరైన పరీక్ష రాలేదు. ఇంగ్లండ్ లో అయితే 1980 నించీ ఎవరన్నా మొత్తం మీద మూడు నెలలుంటే ఈ దానాలు చేయడానికి వీలు లేదు. స్కాట్ లాండ్ , వేల్స్ కూడా అంతే. సౌత్ఈస్ట్ ఏసియాలో కూడా మలేరియా సమస్య వుంది." వివరించారు.

అక్కడ నించి ముందుకు సాగాను ఆ డోనర్ తో.

నర్సు ఖానా డోనర్ ని ఒక చిన్న ఆఫీసు క్యూబికల్ లోకి తీసుకువెళ్ళారు. అక్కడ ఆ డోనర్ టెంపరేచరూ, బీ పీ, పల్సూ చూసీ, బరువు అడిగీ రాసుకున్నారు. ఫార్మాలిటీ కోసం డోనర్ పూర్తిపేరూ, పుట్టిన తేదీ, ఇంటి అడ్రసూ, సోషల్ సెక్యూరిటీ నంబరూ అడిగి డోనర్ పూర్తి చేసిన ఫారం మీద వున్న వివరాలతో చెక్ చేశారు.

అప్పుడు ఖానా డోనర్ కి రక్తంలో ఐరన్ ఎంత వున్నదీ చెక్ చేశారు. చిన్న డిస్పోజబుల్ నీడిల్ తో చేతి వేలు మీద పొడిచి, కాసిని రక్తం చుక్కలు ఒక కాపిలరీ ట్యూబ్ లోకి ఎక్కించారు. ఆ ట్యూబ్ ని ఒక చిన్న మెషిన్ లో పెట్టి, స్విచ్ ఆన్ చేశారు. ఆ మెషిన్ తిరగడం ఆగాక, ఆ ట్యూబ్ ని మెషిన్ ముందర భాగాన వున్న స్కేలు మీద పెట్టి రక్తంతో వున్న ఐరన్ కంటెంట్ ని కొలిచారు.

"రక్తంలో ఐరన్ కంటెంట్ 36 శాతం కన్నా తక్కువ వుంటే వాళ్ళ దగ్గర సించీ ప్లేట్ లెట్స్ తీసుకోము" అని ఖానా చెప్పారు.

"రక్తంలో ఐరన్ కంటెంట్ సరిగా వుండాలంటే ఏం చెయ్యాలి?" అని కుతూహలంగా అడిగాను.

"కిడ్నీ బీన్స్, రెడ్ మీట్, వగైరాలలో ఐరన్ ఎక్కువగా వుంటుంది. చాలా ఆకుకూరలలో కూడా ఐరన్ వుంటుంది. కావాలంటే ప్రత్యేకంగా ఐరన్ సప్లిమెంటు మాత్రలు కూడా వేసుకోవచ్చు." అని చెప్పారు.

ఆ విషయం చెప్పాక నేను అక్కడ సించీ అవతలకి వెళ్ళాలనీ, మిగతా కార్యక్రమం కాన్ఫిడెన్షియల్ అనీ చెప్పారు. కాస్సేపటికి బయటికి వచ్చిన డోనర్ ని అడిగితే, అక్కడ జరిగిన మిగిలిన ఫార్మాలిటీ తెలిసింది.

డోనర్ కి ఒక పేపరు ఇచ్చారుట. దాని మీద బార్ కోడ్ వున్న రెండు స్టిక్కర్లు వున్నాయిట. ఒక స్టిక్కర్ కి పైన పేపరు మీద "Use my blood" అనీ, ఇంకో స్టిక్కర్ కి పైన పేపరు మీద "Do not use my blood" అనీ వుందిట. అందులోంచి ఒక స్టిక్కర్ ని పీకి, ఫారం మీద ఒక చోట అతికించమని చెప్పి, ఆ నర్సు కూడా అటువైపు తిరిగి ఇటు చూడకుండా కూర్చున్నారుట. ఈ డోనర్ "Use my blood" అన్న స్టిక్కర్ తీసుకుని ఫారం మీద అతికించారుట.

డోనర్ వెళ్ళి వీడియో కేసెట్ కాబినెట్ దగ్గర ఆగి, తనకి నచ్చిన సినిమా కేసెట్ వెతుక్కోవడం మొదలుపెట్టారు. ఈ సినిమా కేసెట్ సంగతి నాకు అర్థం కాలేదు.

అక్కడే వున్న నర్సు లూసిండాని (Lucinda Lim) అడిగాను ఆ విషయం గురించి.

లూసిండా ఇలా చెప్పారు.

"ఒక మనిషి శరీరంలోంచి 12 సించీ 16 సార్లు పూర్తి రక్తదానం (whole blood donations) తీసుకుంటేనే గానీ ఒక ప్లేట్ లెట్స్ దానానికి సరిపోయే ప్లేట్ లెట్స్ రావు. ప్లేట్ లెట్స్ కలెక్టు చేసుకోవడానికి టైం పడుతుంది. గంటన్నర సించీ రెండు గంటలు టైం పడుతుంది. ఈ టైంలో బెడ్ పక్కనే వున్న టీవీలో డోనర్ తనకి ఇష్టమైన వీడియో కేసెట్ చూడచ్చు. మా దగ్గర చాలా వీడియో కేసెట్లు వున్నాయి."

అక్కడ ఒక నాలుగు అరల్లో కొన్ని వందల వీడియో కేసెట్లు వున్నాయి. డోనర్లు తమకు ఇష్టం అయిన కేసెట్ సెలెక్టు చేసుకుంటున్నారు.

అప్పటికి లూసిండా చెప్పింది బుర్రలోకెక్కి, అదిరిపడ్డాను.

"ఏమిటీ? అంత రక్తం డోనర్ ఒంట్లోంచి తీసుకుంటారా? డోనర్ కి ప్రమాదం కాదూ?" ఆత్రంగా అడిగాను.

"అబ్బే! ప్లేట్ లెట్స్ డొనేషన్ అంటే అలా చెయ్యరు. దీన్నే ఎఫేరిసిస్ (Apherisis) అనీ, ప్లేట్ లెట్ ఫెరిసిస్ అనీ కూడా అంటారు. ఈ డొనేషన్ టైంలో ఒక చేతిలోంచి రక్తాన్ని తీసి ఒక సెంట్రిఫ్యూజ్ మెషిన్ లోకి పంపిస్తాము. ఆ మెషిన్ రక్తంలోంచి ప్లేట్ లెట్స్ ని వేరు చేసి ఒక బేగ్ లోకి పంపుతుంది. మిగిలిన రక్తం వేరే ట్యూబ్ లోంచి రెండవ చేతి ద్వారా డోనర్ శరీరంలోకి పంపుతాము. ఈ విధంగా డోనర్ రక్తాన్ని ఏమీ కోల్పోరు. ఇలా దానం చేసిన ప్లేట్ లెట్స్ మళ్ళీ 48 గంటల లోపల డోనర్ శరీరంలో తయారవుతాయి. ఈ కలెక్షన్ కిట్ స్టెరైల్ చేసినది వాడుతాము. ఇది ఒక్కసారి మాత్రమే వాడి పారేస్తాము. ప్లేట్ లెట్స్ సంఖ్య ఎంత తగ్గినా, ఎప్పుడూ లిమిట్ లో వుండేటట్టు చూస్తాము. డోనర్ వెంటనే అన్ని రకాల పనులూ చెయ్యొచ్చు. ఎటొచ్చీ ఒక 24 గంటల వరకూ ఎటువంటి తీవ్ర శారీరక ఒత్తిడీ లేకుండా చూసుకోమని చెప్తాము. వారానికి రెండు సార్ల చొప్పున సంవత్సరానికి 24 సార్ల వరకూ ఈ ప్లేట్ లెట్స్ డొనేట్ చెయ్యొచ్చు. సాధారణంగా డోనర్స్ ని రెండు వారాల కొకసారి ప్లేట్ లెట్స్ ఇమ్మని చెబుతాము."

కొత్త విషయాలు తెలుసుకుంటూ వుంటే కొత్త సంతోషంగా వుంటుంది మనసుకి.



అప్పుడు డోనర్ ని ఒక బెడ్ మీద పడుకోబెట్టారు. ఈ బెడ్ ఫ్లాట్ గా లేదు. నడుం దగ్గర నించీ పైకి లేచి, ఎదురుగా వున్న టీవీ చూడటానికి వీలుగా వుంది బెడ్. కాళ్ళతో సహా డోనర్ ని వెచ్చగా దుప్పట్లలో వుంచారు. వెచ్చగా వున్న పాడ్స్ ని డోనర్ రెండు చేతుల మీదా పెట్టారు.

"ఎందుకలా పెట్టారూ?" అని అడిగితే, "అలా పెడితే నరాలు కాస్త వెచ్చబడి కొంచెం వుబ్బుతాయి, సూది దింపడానికి వీలుగా వుంటుంది." అని చెప్పారు.

ముందరగా డోనర్ ఎడం చేతికి బీపీ బెల్టు తగిలించి, ప్రెషర్ పెంచారు. తర్వాత నరం మీద అయొడిన్ రాసి, నరంలోకి సూది దింపారు. అప్పుడు కొన్ని టెస్ట్ ట్యూబ్ ల్లోకి కొంత రక్తాన్ని తీసుకున్నారు.

"ఈ ట్యూబ్ లని ప్లేట్ లెట్స్ పాకెట్ తో పాటు ఇంకో సిటీలో వున్న లేబ్ కి పంపిస్తాము. అక్కడ మళ్ళీ అన్ని పరీక్షలూ చేస్తారు రక్తానికి, ఈ ప్లేట్ లెట్స్ ఇంకో పేషంటుకు ఇచ్చేలోపల." అని నేను మళ్ళీ ప్రశ్నించకుండానే చెప్పారు లూసిండా.

నా వుత్సాహాన్ని చూసి రెడ్ క్రాస్ స్టాఫ్ ముచ్చటపడ్డారు. ఒకళ్ళ తరువాత ఒకళ్ళుగా నేను అడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పారు.

అప్పుడు డోనర్ ఎడం చేతికున్న బీపీ బెల్టు తీసేశారు. ఆ చేతిలోంచి రక్తం వెనక్కి శరీరంలోకి వస్తుందని చెప్పారు. కుడిచేతికి బీపీ బెల్టు తొడిగి, నరం మీద అయొడిన్ రాసి, సూది ఎక్కించారు. ఆ ట్యూబ్ లోంచి రక్తం మెషిన్ లోకి వెళ్ళి, అక్కడ ప్లేట్ లెట్స్ ని మెషిన్ వేరే బేగ్ లోకి పంపాక, ఆ మిగిలిన రక్తం ఇంకో ట్యూబ్ లోంచి డోనర్ శరీరంలోకి తిరిగి రావడం మొదలుపెట్టింది.

హెడ్ నర్సు సీలియా (Celia) మెషిన్ మీద ఏదో బటన్ నొక్కి, 85 నిముషాలు పడుతుంది ఈ డొనేషన్ " అని చెప్పారు.

అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. డోనర్ చేతిలోకి సూదులు ఎక్కించే ముందర, ఇంకో నర్సు ఏఫ్రం (Efrem Rapoport) వచ్చి డోనర్ ని పూర్తి పేరూ, బర్త్ డేటూ, సోషల్ సెక్యూరిటీ నెంబరూ, వగైరా అడిగి, అన్నీ సరిగా వున్నాయని నిర్ధారణ చేసుకుని, కార్యక్రమం మొదలుపెట్టడానికి సిగ్నల్ ఇచ్చారు.

డోనర్ సినిమా చూడ్డంలో నిమగ్నమయ్యాక, సీలియా దగ్గరకి వెళ్ళాను.

"ఈ ప్లేట్ లెట్స్ డిమాండూ, సప్లై ఎలా వున్నాయండీ పేషంట్సు కోసం?" అని అడిగాను.

"డిమాండే ఎప్పుడూ ఎక్కువగా వుంటుంది. ఒకసారి తీసుకున్న ప్లేట్ లెట్స్ లేబ్ లో పరీక్ష చేసి పేషంటుకి 5 రోజుల లోపల ఎక్కించెయ్యాలి. మేము అందరినీ అడుగుతూ వుంటాము డొనేట్ చెయ్యమని. మేము ఇంకా ఇతర సెంటర్ల దగ్గర నించీ తీసుకుంటూ వుంటాము పేషంట్సుకి సప్లై చెయ్యడానికి. సెల్ఫ్ సఫిషియెంటుగా వుండాలని మా ఆశయం."

"మరి మీరు ఈ ప్లేట్ లెట్స్ , బిజినెస్ చేసే హాస్పిటల్ పేషంట్సుకి కూడా ఇస్తారు కదా! మరి వాళ్ళు మీకు ఏ విధంగా సాయం చేస్తారూ?" మళ్ళీ అడిగాను.



"ఆ హాస్పిటల్ మాకు రక రకాల ఆపరేటస్ , మెషిన్లూ సప్లై చేస్తాయి బదులుగా. డబ్బైతే వుండదు గానీ, ఆర్గనైజేషన్ కోసం కావల్సినవి ఇస్తారు." వివరించారు.

"మామూలు రక్తదానంతో పోలిస్తే, ఎందుకండీ ఈ ప్లేట్ లెట్స్ డొనేషన్ ని అంత స్పెషల్ గా చూస్తారూ?" అని అడిగాను మళ్ళీ.

"మామూలు రక్తదానం చేయడానికి 15 నించీ 20 నిముషాల వరకూ టైం పడుతుంది. అదీ రెండు

నెలకొకసారి రక్తదానం చేయచ్చు. ప్లేట్ లెట్స్ దానం అయితే మొదటి సించీ చివర వరకూ రెండు గంటల టైం పడుతుంది. రక్తం శరీరంలోంచీ బయటకి వెళ్ళి మళ్ళీ శరీరంలోకి వస్తోందంటే భయపడతారు చాలా మంది. ధైర్యంగా వుండీ, ఇతర మనుషులకి సాయం చేసే వాళ్ళు ఎప్పుడూ స్పెషలే కదా! రెండు వారాల కొకసారి రెండు గంటల సేపు ప్లేట్ లెట్స్ దానం చేసే వాళ్ళు చాలా ప్రత్యేకమైన మనుషులు. రక్తదానం చేసేవాళ్ళు ఎక్కువగా వున్నారు గానీ ప్లేట్ లెట్స్ డోనర్స్ ఎక్కువగా లేదు. విశాలమైన హృదయం, రెండు చేతులకీ మంచి నరాలున్నవారూ కాబట్టీ వీళ్ళు చాలా స్పెషల్ మనుషులు" అని చెప్పి ఒక డోనర్ ని చెక్ చేయడానికి వెళ్ళిపోయారు సీలియా.

మేము మాట్లాడుకుంటూ వుంటే ఏఫ్రెం అక్కడకి వచ్చారు. అప్పటికి రావాల్సిన డోనర్స్ అందరూ వచ్చేసి, డొనేషన్లు మొదలయ్యాయి.

"చుట్టుపక్కల కొన్ని సెంటర్లు డోనర్సుకి డబ్బిస్తాయని విన్నాము. దాని వల్ల రెడ్ క్రాస్ కి ఏమన్నా ఇబ్బంది వుందా?"

"మా డోనర్స్ మంచి పట్టుదల కలిగిన మనుషులు. డబ్బు కోసం డొనేషన్ చెయ్యరు. సాటి మనుషులకి తోడ్పడటానికి డొనేషన్ చేస్తారు. ఇలా డబ్బిచ్చే సంస్థలు స్వచ్ఛంద డోనర్స్ ని ప్రభావితం చేస్తాయని నేననుకోను."

"డోనర్స్ కి వుండాల్సిన కనీస వయోపరిమితి ఏమిటీ?"

"డోనర్ కి కనీసం 17 ఏళ్ళుండాలి. ముందరగా ఒకసారి రక్తదానం ఇచ్చివుండాలి."

"మీరు కాబోయే డోనర్సుకి ఏమన్నా చెబుతారా?"

"చుట్టూ వున్న మంచి మనుషులందరినీ మా దగ్గరకి రమ్మనీ, ముందర రక్తదానం చేయమనీ, తరువాత ఇవాల్యుయేషన్ చేయించుకోమనీ, అప్పుడు స్వచ్ఛందంగా వచ్చి మా కార్యక్రమంలో పాల్గొని, ప్లేట్ లెట్స్ డొనేట్ చేసి, సాటి మనుషుల జీవితాలు కాపాడమనీ చెబుతాము."

ముందుకు సాగి శేరాని ఆఖరి ప్రశ్న అడిగాను.

"మీరు డోనర్స్ కి ఇక్కడకి రావడానికి ముందర ఏమని సలహా ఇస్తారూ?"

"ఒక రోజు ముందర సించీ బాగా నీళ్ళు తాగమని డోనర్స్ కి చెబుతాము. ఇక్కడకి వచ్చేముందర ఎక్కువగా కాఫీ, టీ తాగి రావద్దని కూడా చెబుతాము. 36 గంటల ముందర సించీ ఏస్ప్రిన్ వేసుకోకూడదు. ఇక్కడకి రావడానికి ముందర ఏమన్నా కొంచెం తిని రమ్మని చెబుతాము. అలాగే ఎక్కువ ద్రవ పదార్థాలు కూడా తీసుకోవద్దు అని చెబుతాము. ఎందుకంటే మెషిన్ కి కనెక్టయి వున్నప్పుడు బాత్ రూం కి వెళ్ళడం కుదరదు. ఒకసారి మెషిన్ డిస్ కనెక్టు చేస్తే, మళ్ళీ ఆ డోనర్ దగ్గర సించీ ప్లేట్ లెట్స్ తీసుకోలేము. అలాగని ఏ ద్రవ పదార్థమూ తీసుకోకుండా డీహైడ్రేట్ కూడా అయిపోకుండా బేలెన్స్‌డ్ గా వుండాలి. రెండు, మూడు గంటల ముందర సించీ ఆల్కహాల్ తీసుకోవద్దని చెబుతాము."

అప్పటికి ప్లేట్ లెట్స్ డొనేషన్ పూర్తయింది. ముందరగా డోనర్ కుడిచేతి ట్యూబ్ తీసేసి కట్టు కట్టారు. అప్పుడు మెషిన్ లో వున్న రక్తం రింజ్ అయి, ఇంకో ట్యూబ్ లోంచీ డోనర్ శరీరంలోకి ఎడంచేతి ద్వారా రావడానికి ఒక 5 నిముషాలు పట్టింది. అప్పుడు ఆ ట్యూబ్ కూడా తీసేసి, ఎడంచేతికి కూడా కట్టు కట్టారు.



ఆ తరువాత డోనర్ కి Post-Donation and Call-Back instructions వున్న ఒక పేపరు ఇచ్చారు, అవసరం వస్తుందేమోనని.

అప్పుడప్పుడు 10 నిముషాల కాలింగ్ కార్డులూ, కప్పులూ, టీ షర్టులూ ఇస్తారని డోనర్ చెప్పారు.

ఆ డోనర్ కి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

తరువాత రెడ్ క్రాస్ స్టాఫంతటికీ కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

కాబట్టి ఒక ఎఫీరిసిస్ ప్లేట్ లెట్ డోనర్ కావాలంటే ఏం చెయ్యాలి?

1. ముందుగా మామూలు డోనర్ కున్న ప్రమాణాలన్నింటినీ సంతృప్తి పరచాలి.
2. దగ్గరలో వున్న రెడ్ క్రాస్ బ్లడ్ బేంక్ కి వెళ్ళి, డొనేషన్ కి ముందర పరీక్షలు చేయించుకోవాలి.
3. ఆ తరువాత బ్లడ్ బేంక్ నించీ పరీక్షా ఫలితాలకి ఫోన్ కాల్ కోసం ఎదురుచూడాలి.
4. అనుమతి పొందాక అపాయింట్ మెంట్ తీసుకోవాలి.
5. రెండు నించీ మూడు గంటల టైం ఒక డొనేషన్ కోసం కేటాయించాలి.

ఇంకా వివరాలు కావాలంటే http://www.santaclaravalley.redcross.org/index.html చూడండి. ఈ వ్యాసం చదివి ఏ ఒక్క పాఠకులైనా ప్లేట్ లెట్ డొనేషన్ చేస్తే, నా ధ్యేయం నెరవేరినట్టే!!

---

ఈ ఇంటర్వ్యూ ఫొటోలు తీసిన చిరంజీవి తేజకి కృతజ్ఞతలు.
మీ సూచనలూ, సలహాలూ తెలియచేయండి.